# తాతిగాడి చొక్కా

తాతిగాడికి మెలకువ వచ్చింది. ఒక కల - కలలో వాడి తలపైన బల్లి పడింది. అలా బల్లి పడితే కలహమో, పాడో అంటారు కదా! వాడు ఉలిక్కిపడి లేచాడు. కప్పుకున్న పాత దుప్పటి తొలగించి చూశాడు. అవతల గోడపైన రాత్రివేళల తిరిగే పిట్ట ఏదో నిలబడి నెమ్మదిగా కూస్తున్నది.

తాతిగాడు కళ్ళు నులుముకుని, ఒళ్ళు విరుచుకుని, వేళ్ళు విరుచుకుని లేని ఆ చిన్నవరండా చివరకు వచ్చి నిలబడ్డాడు. బయట పలుచుగా వెన్నెల. నాలుగు గంటలవుతున్నదేమో.

ఇక నిద్ర వచ్చేట్టు లేదు.

'ఉహుహు... ఉహుహు' అని వణుకుతూ ఒక్క నిమిషం నిలబడ్డాడు. బయట చలిగాలి పెద్దపులిలాగా విసురుగా విహరిస్తున్నది.

తాతిగాడు వణుకుతూనే హుషారుగా సన్నగా ఈల వేశాడు. ఇవాళ తెల్లవారకుండానే, వెలుతురు బాగా రాక ముందే త్వరత్వరగా స్నానం చేసి, తల నున్నగా దువ్వుకుని, ఆ కొత్త చొక్కా తొడుక్కుని దర్జాగా బయలుదేరాలి. కాస్త నడిస్తే చాలు ఆంజనేయ స్వామివారి గుడి... గుళ్ళోకి పెందలకడనే వెళ్ళాలి. దేవుడికి దణ్ణం పెట్టుకోవాలి.

ఇవ్వాళ ప్రెస్సు చాకిరీ లేదు. ఇంట్లో స్వేచ్ఛ... తానొక్కడూ... మామయ్యా, అత్తయ్యా వగైరాలందరూ ఏదో పెళ్ళికి వెళ్ళారు. రేపుగానీ రారు. అంత వరకు తనకు అటవిడుపు. గుడిలో పని అయిపోగానే ఎక్కడైన ఇంత తిని, కాఫీ తాగి ఉదయం ఆటకు

చెక్కేయాలి. ఆ తర్వాత హోటల్ భోజనం చేసి వచ్చి హాయిగా పడుకోవాలి. ఈ మధ్య పగలెన్నడూ నడుంవాల్చలేదు. అసలు తీరిక ఎక్కడ ? ఉదయం ఎనిమిది గంటలకల్లా ప్రెస్సులో చాకిరీ మొదలు. రాత్రి తొమ్మిది, ఒక్కొక్కప్పుడు పది కూడా దాటుతూ ఉంటుంది ఇల్లు చేరేసరికి. అప్పుడు అత్తయ్య నణుక్కుంటూ పడేసే రెండు ముద్దలు తిని తొంగోడం...

ఎప్పుడూ ఇంతే...

ఇవాళ తాతిగాడికి మహా హుషారుగా ఉంది. చలికి వణుకుతూనే పంచలో ఒంటి నిండా దుప్పటి కప్పుకుని కూర్చున్నాడు. ఎదురుగా చంద్రబింబం నిర్మలాకాశంలో తళతళ మెరుస్తున్నది.

నిన్న... సరిగ్గా నిన్న సాయంకాలం అయిదు గంటల వేళ... తాతిగాడు తన పక్షం రోజుల నాటి కోరిక తీర్చుకున్నాడు. పదిహేను రోజుల కిందట వాడు ప్రెస్సునుంచి చేతిలో ఫ్లాస్కుతో బయలుదేరాడు. సాయంవేళ... ప్రెస్సుకు వచ్చిన ఎవరో పెద్ద మనషులకు చక్కని రుచికరమైన పద్మినీ జాతి టీ కావలసి వచ్చింది. దూరమైనా సరే ఫలానా చోటికే పోయి టీ పోయించుకు రమ్మన్నారు. వాడు రోడ్డు మీద నడుస్తున్న వాడల్లా ఒకచోట ఆగిపోయాడు. పేవ్‌మెంట్ మీద ఒకడు ఎదురుగా రంగురంగుల ప్యాంట్లూ, షర్టులూ పేర్చుకుని కూర్చుని ఉన్నాడు. అవన్నీ సినిమాల్లో షూటింగుల్లో నటులు వాడి పారేసిన బాపతు. అయితేనేమి ? ఎంతో అందంగా, కళ్ళు చెదిరే రంగుల్లో అద్భుతంగా ఉన్నాయి.

తాతిగాడు అక్కడే కూలబడి వాటిని తిరగేశాడు. ఒక చొక్కా వాడి మనసును చెదరగొట్టేసింది. వాడి కళ్ళు జిగేల్మన్నాయి. దాన్ని అటూ ఇటూ తిప్పి చూసి 'ఎంత ?' అని అడిగాడు. రేటు వినగానే అంతగానూ నీరసపడిపోయాడు. కానీ, సంకల్పం మాత్రం వీడలేదు. వాణ్ణి బతిమాలుకున్నాడు. దాన్ని వేరే ఉంచమన్నాడు. అయిదారు రోజుల్లో తప్పకుండా కొనుక్కుంటానన్నాడు. తల్లితోడు.. నమ్మమని ప్రాథేయపడ్డాడు. అవతలివాడు కూడా ఏమనుకున్నాడో ఏమో సరే అన్నాడు.

ఆ తర్వాత రోజూ వచ్చేటప్పుడూ, వెళ్లేటప్పుడూ అక్కడ ఆగడం, దాన్ని కళ్ళారా చూసుకుని ఆనందించడం, మళ్ళీ మళ్ళీ దాన్ని ఇతరులకు అమ్మ వద్దని ప్రాథేయపడడం... ఇలా సాగింది వ్యవహారం.

తాతిగాడు ఆ క్షణం నుంచే డబ్బు కూడబెట్టాడు. ప్రెస్సులో తనతో పని చేసే తన ఈడువాడు రంగడు ఇవ్వాలసిన ఎనిమిది రూపాయల బాకీ ముక్కు పిండి మరీ వసూలు చేశాడు. బస్సులెక్కడం మానేశాడు. కాలినడకన తిరిగాడు. చిరుతిళ్ళు మానుకున్నాడు. ఏమైతేనేమి, నిన్న సాయంకాలమే నలభై రూపాయల కష్టార్జితం ధారపోసి ఆ చొక్కా సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఆ చొక్కా లోపల అల్మారులో ఉంది. తాతిగాడు లేచి తలుపు తీసుకుని లోపలికి వెళ్ళి దాన్ని ఇవతలికి తీసి లాంతరు వెలుగులో తృప్తిగా చూసుకున్నాడు.

ఏ సినిమాలోనో ఎవడో నటుడు ఏ పాట చిత్రీకరణ వేళలోనో ఒక్కసారి మాత్రం తొడిగి అవతల పారేసి ఉంటాడు. వాడి సొమ్మేం పోయింది ? మాటమాటకూ,

గంతుగంతుకూ కొత్తకొత్త బట్టలు కట్టించి ఇచ్చే నిర్మాత ఉంటాడు గదా! ఇది ఈనాటికి తనకు దక్కింది.

తాతిగాడు వెనుక వైపు వరండాలో చిన్న రేకుల స్నానాల గదిలో ముందు మొహం కడుక్కున్నాడు. తర్వాత పనిలో పనిగా రాగాలు తీస్తూ జిల్లు మనే చన్నీళ్ళతో స్నానం చేశాడు. ఒళ్ళు తుడుచుకుని వచ్చి అద్దం ముందు వణుకుతూనే చాలా సేపు నిలబడ్డాడు. మొహం అటూ ఇటూ తిప్పి అద్దంలో తన అందం చూసుకున్నాడు. మొహం మీద నుదుట మధ్యగా పెద్ద మచ్చ... ఎప్పుడో బాగా చిన్నప్పుడు ఒకనాడు చిన్న బిడ్డ చేష్ట వచ్చి తాను చచ్చిపోయేవాడు. సమయానికెవరో వచ్చి ఎర్రగా కాలుతున్న చుట్టతో నుదుట కాల్చి తనను బతికించారట. అది మినహా తనది అందమైన ఫేసే. ఒక కాలు మరోకాలికంటే కొంచెం పొట్టి. అది ఎందువల్ల జరిగిందో తెలియదు. అమ్మానాన్నలకు ఊరికే వరుసగా బిడ్డలు పుట్టి పోయారుట. తానొక్కడే బతికి ఈ పదిహేనేళ్ళూ బట్టకట్టాడు. ఆ అమ్మానాన్నలు కూడా తర్వాత ఎంతో కాలం బతకలేదు. తన నాలుగో ఏట ముందుగా తల్లీ, ఆ తర్వాత మరో సంవత్సరానికి తండ్రీ కూడా వెళ్ళిపోయారు. తనకు తాతయ్య అని పేరెందుకు పెట్టారో తెలియదు.

ప్రెస్సు యజమాని ఒరే తాతిగా అని పిలుస్తాడు. అత్తామామయ్యలు తాతీ అని పిలుస్తారు. అయినా, తనకేమీ బాధలేదు. లోకంలో ఎన్ని రకాల పేర్లు లేవు? వాటిలో తనదీ ఒకటి. నిజానికీ చాలా పేర్లకంటే తన పేరేమీ తక్కువది కాదు. తనకు తెలిసి పెంటయ్య ఒకడున్నాడు. పైగా, వాడొక హోటల్లో సర్వరు. వాడు తన పేరు తలుచుకుని సిగ్గుపడుతున్నాడా? అబద్ధాలుగాడొకడున్నాడు. వాడు మాత్రం బాధపడుతున్నాడా? కాబట్టి తన పేరు తనకు బాగానే ఉంది. అంతగా అయితే, పెద్దయ్యాక పేరు మార్చుకోవచ్చునని ప్రెస్ యజమాని చెప్పాడు.

తాతిగాడు కిటికీలో నుంచి బయటికి చూశాడు. ఇంకా చీకట్లు తొలగిపోలేదు. కానీ, ఏదో ఒక విచిత్రమైన వెలుతురు వ్యాపిస్తున్నది. అది పైన నక్షత్రాల నుంచి వస్తున్నదో, నిర్మలాకాశం నుంచి వస్తున్నదో తెలియడం లేదు.

కరెంటు కోత మూలంగా వీధి లైట్లు మాత్రం ఇప్పుడు అస్సలు వెలగడం లేదు. కానీ, చిత్రమేమిటంటే వీధి లైట్లన్నీ విరామం లేకుండా పగలల్లా వెలుగుతూనే ఉంటాయి.

తాతిగాడు ఈల వేసుకుంటూ లాగూ తొడుక్కున్నాడు. తర్వాత అతి సుతిమెత్తగా, అప్యాయంగా చొక్కా అందుకుని మడతలు విప్పి తొడుక్కున్నాడు. కొంచెం వదులు అయితే అయింది కానీ, అద్భుతంగా ఉంది. మెత్తగానూ, మృదువుగానూ ఉంది. అసలు వదులుగా ఉండే చొక్కాలే ఈనాటి ఫ్యాషన్, తాను స్కూలు, కాలేజీ పిల్లలను చూస్తూ ఉంటాడు కదా!

అద్దం ముందు నిలబడి పక్కా మూడు నాలుగు నిమిషాల సేపు తల దువ్వుకున్నాడు. పౌడరు తీసి ముఖానికి పులుముకున్నాడు. మొహం అటూ ఇటూ తిప్పి అన్ని కోణాల నుంచీ చూసుకున్నాడు. తన మొహం తనకే ముద్దొచ్చింది.

తర్వాత బయలుదేరి సగం అరిగిన హవాయి చెప్పులు తొడుక్కుని ముందు గది తలుపు తాళం వేసి ఇవతలకి వచ్చాడు.

ఇవాళ తాతిగాడికి మహా హుషారుగా ఉంది. చలికి వణకుతూనే పంచలో ఒంటి నిండా దుప్పటి కప్పుకుని కూర్చున్నాడు. ఎదురుగా చంద్రబింబం నిర్మలాకాశంలో తళతళ మెరుస్తున్నది.

రెండు నిమిషాలు నడిస్తే అంజనేయస్వామి వారి దేవాలయం చిన్నదే కానీ, అక్కడ మహా రష్... ఆ దేవుడికి ఎక్కడలేని డిమాండ్... నగరంలో ఎవరే వాహనం కొన్నా ముందు పూజాదికాలకు అక్కడికి రావలసిందే. ఏ సినిమా రిలీజయినా ఆనాడు ముందు అక్కడ డబ్బాలకు ఆ దేవుడి సన్నిధిలో పూజలు జరగవలసిందే. అయితే చిత్రం ! ఆ గుడికి కింద ఆరోడ్డు మీదనే మరో సత్యనారాయణ స్వామివారి దేవాలయం ఉంది. అదేమిటోగాని అక్కడ ఏ హడావిడీ ఉండదు. ఇక్కడి పూజారులు నవనవలాడుతూ, ధనం వాసన కొడుతూ, కొత్త అయిదువందల రూపాయల నోట్ల కట్టలలాగుంటే, అక్కడి పూజారి ఒక్కడే పాపం - పాత పట్టుబట్ట కట్టుకుని దీనంగా భక్తుల కోసం ఎదురుచూస్తూ ఉంటాడు - పాత రెండు రూపాయల నోటుకు మల్లే.

ఇక్కడ ఆ వేళకే పూజారుల హడావిడి మొదలయింది. లోపల మైకు ధ్వనులు వినిపిస్తున్నాయి.

చలిగాలి విసురుగా వీస్తున్నది. తాతిగాడు లాగూ జేబుల్లో చేతులుంచుకుని సన్నగా వణుకుతూ కాలు ఎత్తెత్తి వేస్తూ నడిచాడు.

ఇక్కడ రోడ్డు రెండుగా చీలుతున్నది. తాను నేరుగా వెళ్ళాలి. తాతిగాడు అకస్మాత్తుగా ఆగిపోయాడు. చూపులు ఎక్కడో నిలిచి పోయాయి. ఒక్కసారి చుట్టూ చూశాడు. పాల వ్యాను ఇంకా రాలేదు. ఒకటీ అరా రిక్షాలు మాత్రం ఇటూ అటూ వెళ్లాయి. ఒకరిద్దరు దూరదూరంగా ఎవరి దారిన వాళ్ళు వెళ్లారు. కానీ, తాను చూస్తున్నది వాళ్ళు గమనించలేదు.

తాతిగాడు కొయ్యబారిపోయి నిలబడిపోయాడు.

రెండు రోడ్ల మూల ఒక విగ్రహం... ఎత్తుగా... ఒక జాతీయ నాయకుడిది ఉంది. అది ఒక మూలగా ఎవరికీ పట్టనట్టు ఉంటుంది. ఏ జయంతికో, వర్ధంతికో మాత్రం అక్కడ రంగురంగుల కాగితపు తోరణాలు కట్టి హడావిడా చేసి, కాసిని దండలు వేసి, మైకులు కట్టి, ఉపన్యాసాలు దంచి గొడవ చేసి పోతుంటారు. ఆ తంతు పూర్తి అయ్యాక మళ్ళీ మామూలే. మామూలు సమయాల్లో దానివైపు చూసే నాథుడే ఉండడు.

ఇవాళ....! ఇప్పుడు ! ఆ విగ్రహం మెడలో ఒక చెప్పుల దండ ఉంది. మసక వెలుతురులో తాతిగాడికి అది కనిపిస్తూనే ఉంది.

తాతిగాడు ఒక్క క్షణం ఆలోచించాడు. ఇలాంటిదెప్పుడో ఎక్కడో జరిగింది. ఆ తర్వాత అంత బీభత్సమూ జరిగింది. ఆ కూడని పని ఏ చిలిపివాళ్లో లేక ఏ అతి తెలివి కలవాళ్ళో చేసి ఉండవచ్చు. కానీ, కాస్సేపాగి వెలుతురు వచ్చాక జనం కళ్ళలో పడకపోదు. అప్పుడు దురంతాలు జరిగిపోతాయి. అల్లర్లూ, కేకలూ, రెచ్చిపోవడాలు, బస్సుల మీద దాడులు, దహనాలు, పోలీసులూ, లాఠీచార్జీలూ, ఇంకా బహుశా ఫైరింగులూ, షామియానాలు, నిరసన దీక్షలు, రిలే నిరశన దీక్షలు బందులూ - ఇంకా

అంతా భయంకరంగా తయారై చుట్టుపక్కల జన జీవితం అస్తవ్యస్తమైపోతుంది.

తాతిగాడు ఇక ఎక్కువ ఆలోచించలేదు. మెరుపులా కదిలి వెళ్ళి ఆ విగ్రహం ఉన్న దిమ్మ మీదికి ఎగిరి విగ్రహం మెడలో ఉన్న ఆ పాపిష్టి చెప్పుల దండను తీసి అవతల పారేద్దామని ప్రయత్నించాడు.

అయితే, అది ఒకటి రెండు ప్రయత్నాలలో రాలేదు సరికదా, విగ్రహం మెడలో బిగిసి తగులుకుని ఉండిపోయింది.

తాతిగాడు వెసుదిరగదలచలేదు. ఒక కాలు విగ్రహం చేతిమీద ఉంచి, మరో కాలు మరో చేతి మీద ఉంచి పైకిలేచి విగ్రహం గుండెల మీదికి పాకుతూపోయాడు.

అంతలో...

కింది నుంచి భీకరంగా కేక వినిపించింది.

'ఎవడ్రా అది ? ఏం చేస్తున్నావక్కడ ?'

తాతిగాడు అది విని కిందికి చూసి, 'ఇది తీసి పారేస్తున్నా' అన్నాడు. ఆ మాట కిందివాడికి వినిపించలేదు.

'అరె ! దొంగ నాకొడకా ! ఏం పనిరా అది ? దిగు దిగు ముందు.' ఆ అరుపులు చుట్టుపక్కల ప్రతిధ్వనించాయి అప్పుడు.

పాల వ్యాను వచ్చి ఆగింది. అప్పటికప్పుడు క్షణాల వ్యవధిలో పదిమంది దాకా పోగైనారు.

'ఏమిటి ? ఏమిటి ?'

'వాడు చూడండి వాడు చేసే పని చూడండి. అదేం బుద్ధిరా నీకు ? వెధవా దిగు...' మరో పదిమంది... ఇంకా పదిమంది... క్షణాలలో యాభై మంది దాకా పోగై పెద్ద గుంపు తయారయింది. అందరూ అరుస్తున్నారు. ఎవరూ ఎవరినీ వినిపించుకోవడం లేదు.

పైన తాతిగాడు నిలువుగా వణికిపోతున్నాడు. లోగొంతుకతో 'నేను దీన్ని తీసి పారేస్తున్నాను!' అంటున్నాడు. వాడి గొంతు వాడికే వినబడటం లేదు.

ఎవరో ముగ్గురు పైకి ఎక్కి, వాణ్ణి కిందికి తోశారు.

వాడు జనం మధ్యలో పడ్డాడు.

వాడి మీద పిడిగుద్దులు పడ్డాయి.

వాడు 'బాబో... నేనే పాపం ఎరగనని' మొత్తుకుంటున్నాడు.

దణ్ణాలు పెడుతున్నాడు.

'వీడికి పుట్టిన బుద్ధి కాదు ఇది.'

'ఎవరో దుర్మార్గులు చేయించి ఉంటారు ! వీరి నాలుగు తగలనివ్వండి ! పొగరణుగుతుంది.

పేరు తాతిగాణ్ణి తోశారు. తొక్కారు. దొర్లించారు. చొక్కా పట్టుకుని గుంజి

మొహాన గుద్దులు కురిపించారు. అంతలో పోలీసులు వచ్చారు. లాఠీలు తిప్పుతూ జనాన్ని తొలగించి, తాతిగాణ్ణి లేవదీసుకుని జీపులో వేసుకుని తీసుకుపోయారు.

ఆ తర్వాత అక్కడ చేరిన వారు తమలో తాము మంతనాలు జరుపుకున్నారు. ఆచెప్పుల దండను దూరంగా విసిరేశారు. చందాలు వేసుకుని పాలు పోయించుకుని ఆ విగ్రహానికి క్షీరాభిషేకం జరిపించారు. షామియానాలు వేసి, మైకులు బిగించి ఉద్రేకంతో ఊగిపోతూ ఉపన్యాసాలిచ్చారు. ఊళ్ళో ఉన్న చిన్నా చితక రాజకీయ నాయకులందరూ పోటాపోటీగా వచ్చి సందేశాలిచ్చి వెళ్ళారు.

మధ్యాహ్నానికి అంతా సద్దు మణిగింది.

పోలీస్ స్టేషన్‌లో ఎస్. ఐ. ఎదురుగా నేలమీద కూర్చుని ఉన్నాడు తాతిగాడు.

వాడి గాథ అంతా విని ఆయన నిశ్శబ్దంగా ఉండిపోయాడు. టీ తెప్పించి తాను తాగుతూ వాడికీ ఇప్పించాడు.

"నేను చూసుకుంటాలే. భయపడకు" అని ధైర్యం చెప్పాడు.

తాతిగాడు టీ తాగి కప్పు దూరంగా నేల మీద ఉంచి చొక్కా వంక చూసుకున్నాడు.

అది నిలువుగానూ, అడ్డంగానూ, అడ్డదిడ్డంగానూ చిరిగి చీలికలు పీలికలై ఘోరంగా ఉంది.

వాడి కళ్ళలో నీళ్ళుబికి వచ్చాయి.

ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక **1996**